ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణం కూల్చివేత


ప్రభుత్వ భూమిలో అక్రమ కట్టడాన్ని నేల మట్టం చేసిన రెవెన్యూ అధికారులు

అబ్దుల్లాపూర్‌మెట్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ తట్టిఅన్నారం సర్వే నంబర్ 73లోని ప్రభుత్వ భూమిలో వెలసిన అక్రమ నిర్మాణాన్ని అబ్దుల్లాపూర్‌మెట్ మండల రెవెన్యూ అధికారులు శనివారం కూల్చివేశారు. ప్రభుత్వ స్థలంలో వెలసిన అక్రమ కట్టడంపై అధికారులకు ఫిర్యాదు అందింది. దాంతో జేసీబీతో ఆ కట్టడాన్ని నేలమట్టం చేశారు. సదరు సర్వే నంబర్‌లోని భూమిని హౌసింగ్ బోర్డుకు కేటాయించినట్లు తహసీల్దార్ సుదర్శన్‌రెడ్డి తెలిపారు. ప్రభుత్వ భూముల ఆక్రమణ, కబ్జాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుని క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

వికసిత్ భారత్ నిర్మాణంలో సహకార సంఘాల పాత్ర గొప్పది

హయత్‌నగర్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): తుర్కయంజాల్ రైతు సేవా సహకార సంఘం ఆవరణలో శనివారం అఖిల భారత సహకార వారోత్సవాలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తుర్కయంజాల్ రైతు సేవా సహకార సంఘం వైస్ చైర్మన్ కొత్త రాంరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 71వ అఖిల భారత సహకార వారోత్సవాలను నవంబర్ 14 నుంచి 20వ తేదీ వరకు నిర్వహించడం జరుగుతుందన్నారు. వికసిత్ భారత్ నిర్మాణంలో సహకార సంఘాల పాత్ర గొప్పదని అన్నారు. కార్యక్రమంలో సహకార సంఘం డైరెక్టర్లు, వంగేటి లక్ష్మారెడ్డి, సామ సంజీవరెడ్డి, చాపల యాదగిరి, జక్క కృష్ణారెడ్డి, సత్యనారాయణరెడ్డి, సంఘం కార్యదర్శి రాందాసు, అసిస్టెంట్ రిజిస్ట్రార్ విజయ, అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

సహకార సంఘాల ద్వారా ఆర్థిక చేయూత

ఓల్డ్‌మలక్‌పేట, నవంబరు 16(ఆంధ్రజ్యోతి) : కోఆపరేటివ్ సహకార సంఘాలు ప్రజలకు ఆర్థిక చేయూత అందిస్తాయని గోల్కొండ కోఆపరేటివ్ సొసైటీ డిప్యూటీ సబ్‌రిజిస్ట్రార్ టి. రోజారాణి అన్నారు. 71వ జాతీయ కోఆపరేటివ్ వారోత్సవాలను పురస్కరించుకొని శనివారం ఓల్డ్‌మలక్‌పేటలోని తిరుమల కోఆపరేటివ్ బ్యాంక్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై ఆమె మాట్లాడుతూ బ్యాంకింగ్ రంగంలో వినియోగదారులకు కోఆపరేటివ్ సంఘాలు ఆర్థిక ప్రయోజనాలు చేకూరుస్తున్నాయన్నారు. వివిధ రంగాల్లో ఉన్న కోఆపరేటివ్ సొసైటీల ద్వారా ప్రజలకు సులువుగా రుణాలు, ప్రోత్సాహకాలు అందుతున్నాయని తద్వారా ప్రజలకు ఆర్థిక పరిపుష్టి చేకూరుతుందన్నారు. కార్యక్రమంలో బ్యాంక్ చైర్మన్ చంద్రశేఖర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కొత్తపేట శృంగేరికాలనీలోని ప్రభుత్వ స్థలం అన్యాక్రాంతం

- సత్వరం చర్యలు తీసుకోవాలని కార్పొరేటర్ ఫిర్యాదు

కొత్తపేట, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): ఉప్పల్ మండల పరిధి కొత్తపేట డివిజన్ పరిధి శృంగేరికాలనీలోని 135 సర్వే నెం.లో గల 500 చ.గజాల ప్రభుత్వ స్థలం అన్యాక్రాంతమైందని సత్వర చర్యలు తీసుకోవాలని శనివారం ఉన్నత అధికారులకు కార్పొరేటర్ పవన్‌కుమార్ ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాత్రికి రాత్రే శృంగేరి కాలనీలోని ప్రభుత్వ స్థలాన్ని అన్యాక్రాంతం చేసి ప్రహరీ నిర్మించారన్నారు. విషయం తెలిసిన వెంటనే మేడ్చల్ జిల్లా కలెక్టర్‌కు, జాయింట్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామని తెలిపారు. కొత్తపేట డివిజన్‌లో గల ప్రభుత్వ స్థలాల సంరక్షణకు అధికారులు ప్రహరీ నిర్మించాలని, ప్రభుత్వ స్థలమని సూచిక ఏర్పాటు చేయాలని కోరామన్నారు.

ప్రజల సహకారంతో ముమ్మరంగా సర్వే

- జీహెచ్‌ఎంసీ ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్


సర్వే తీరును పరిశీలిస్తున్న జెడ్సీ హేమంత్ కేశవ్ పాటిల్, ఉపకమిషనర్ యాదయ్య

మన్సూరాబాద్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన కులగణన సర్వే ప్రజల సహకారంతో జీహెచ్‌ఎంసీ ఎల్బీనగర్ జోనల్ పరిధిలో ముమ్మరంగా కొనసాగుతోందని జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్ పేర్కొన్నారు. ఇందులో భాగంగా హయత్‌నగర్ సర్కిల్ పరిధి నాగోల్ డివిజన్ సాయినగర్‌కాలనీలో శనివారం జరుగుతున్న తీరును సర్కిల్ ఉప కమిషనర్ డాక్టర్ తిప్పర్తి యాదయ్యతో కలిసి పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ ప్రాజెక్ట్ ఆఫీసర్ పి.బలరాం, వార్డు అడ్మినిస్ట్రేటివ్ అధికారి ఎం.విక్రమ్, టాకింగ్ ఇన్‌స్పెక్టర్ మహ్మద్ జాహీద్, ఎన్యూమరేటర్లు పాల్గొన్నారు.

మలక్‌పేట డివిజన్‌లో 15వేల ఇళ్ల సర్వేపూర్తి

ఓల్డ్‌మలక్‌పేట : మలక్‌పేట డివిజన్‌లో ఇంటింటా సర్వే కొనసాగుతుంది. సర్కిల్ 6 పరిధిలో మొత్తం 69,800 ఇళ్లు ఉన్నాయి. ఎన్యూమరేటర్లు ఇప్పటి వరకు 15వేల ఇళ్లకు సర్వే పూర్తిచేశారు. 23శాతం సర్వే పూర్తయినట్లు అధికారులు తెలిపారు. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి శనివారం సైదాబాద్ ఏరియాలో సర్వే పనితీరు పర్యవేక్షించారు. ఎన్యూమరేటర్లకు సూచనలు సలహాలు ఇచ్చారు. సర్వే నిర్దేశించిన సమయంలో పూర్తి చేయాలని సూచించారు.

హనుమాన్ ఆలయంలో ఘనంగా పల్లకీ సేవ

చంపాపేట, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్‌లోని హనుమాన్ ఆలయంలో శుక్రవారం రాత్రి కార్తీక మహోత్సవంలో భాగంగా ఆకాశ దీపారాధన, పల్లకీసేవ, రథోత్సవం కార్యక్రమాన్ని భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్, మాజీ ఎంపీ మధుయాష్కీగౌడ్, రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి, మాజీ చైర్మన్ నల్ల రఘుమారెడ్డి కార్తీక మహోత్సవంలో పాల్గొని ధ్యానాంజనేయస్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలు చేశారు. స్వామి వారికి వారు ముడుపులు చెల్లించారు. అర్చకులు వారికి ఆశీర్వచనాలు అందించగా, నల్ల రఘుమారెడ్డి, ఆలయ ఈఓ ఎస్.లావణ్య స్వామి వారి చిత్రపటాలు(జ్ఞాపిక), ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ వజీర్ ప్రకాష్‌గౌడ్, ఆలయ మాజీ ధర్మకర్తలు బబ్బూరి ఆనంద్‌కుమార్‌గౌడ్, చీర తిరుమలేష్, కోటగిరి శ్రీనివాస్, దుర్గారెడ్డి, శ్రీపాల్‌రెడ్డి, భక్తులు ఇంద్రారెడ్డి, బద్రీనాథ్, కిరణ్ పాల్గొన్నారు.

వీరాంజనేయస్వామికి లక్ష తమలపాకుల పూజ

ఎల్బీనగర్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): సరూర్‌నగర్ వెంకటేశ్వరకాలనీలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీవారి 40వ సప్తాహ్నిక బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. శనివారం ఉదయం వీరాంజనేయస్వామికి పంచామృతాభిషేకం, మన్యుసూక్త హోమం, లఘుపూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం భక్తులచే వీరాంజనేయస్వామికి లక్ష తమల పాకుల పూజచేయించారు. సాయంత్రం వీరాంజనేయస్వామి వారి పల్లకిసేవ పురవీధులలో కనుల పండువగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కోరుపోలు భాస్కర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి శాంతి ప్రసాద్, మాజీ చైర్మన్ గండు ధనంరెడ్డి, కమిటీ ప్రతినిధులు భోగేశ్వర్‌రావు, సుబ్బారావు, శ్రీనివాస్‌రావు, ప్రతాప్‌రెడ్డి, మహేందర్, ఆలయ కమిటీ సభ్యులు రవీందర్‌రావు, వీరేందర్‌రెడ్డి, కాలనీ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి కనకరావు, ఉపాధ్యక్షుడు మారోజు శ్రీనివాసచారి, అర్చకులు కృష్ణమాచార్యులు, వంశధారచార్యులు, రామకృష్ణమాచార్యులు, శ్యాంసుందర్‌శర్మ పాల్గొన్నారు.

వైభవంగా లక్షదీపోత్సవం

ఎల్బీనగర్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి) : కార్తీక మాసం సందర్భంగా ఆర్‌కేపురం డివిజన్ వాసవీకాలనీలోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో శనివారం లక్షదీపోత్సవం వైభవంగా నిర్వహించారు. లక్ష దీపోత్సవంలో వందలాది మంది మహిళలు పాల్గొని కార్తీక దీపాలను వెలిగించారు. కార్యక్రమంలో వాసవీకాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు గౌరీశెట్టి చంద్రశేఖర్‌గుప్తా, కార్యదర్శి అయిత అంజయ్యగుప్తా, కోశాధికారి కృష్ణయ్య, కన్వీనర్ తమ్మన శ్రీధర్, గౌరీశెట్టి అరుణ్, సుదర్శన్, వాసవీ మహిళ మండలి ప్రతినిధులు చిలుక మధుర ఉపేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

మలక్‌పేట మార్కెట్ అభివృద్ధికి కృషి : వైస్ చైర్మన్


కోట్ల శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న బస్తీ సంక్షేమ సంఘం ప్రతినిధులు

సైదాబాద్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): మలక్‌పేట వ్యవసాయ మార్కెట్ అభివృద్ధి కోసం కృషి చేస్తానని మార్కెట్ వైస్ చైర్మన్ కోట్ల శ్రీనివాస్ అన్నారు. నూతనంగా మలక్‌పేట మార్కెట్ వైస్ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన సందర్భంగా ఐఎస్‌సదన్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు నాగరిగారి దాసు ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, సింగరేణి బస్తీ సంక్షేమ సంఘాల ప్రతినిధులు శాలువ కప్పి సన్మానించారు. మార్కెట్‌లో రైతులకు, వ్యాపారులకు, ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా మరింతగా వసతులు మెరుగుపరుస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎస్టీ సెల్ రాష్ట్ర కోఆర్డినేటర్ గణేష్‌నాయక్, కన్వీనర్ ఇస్లావత్ కిషన్‌నాయక్, శంకర్‌నాయక్, రమేష్, దేవి, పంతూనాయక్, వెంకటస్వామి పాల్గొన్నారు.

నిరాశ్రయ బాలుర ఆత్మబంధువు కారుణ్య సింధు ఆశ్రమం

- నేడు 25వ వార్షికోత్సవం


శిక్షణ తరగతులలో బాలురు

సైదాబాద్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రుల ప్రేమకు నోచుకోని నిరాశ్రయ బాలురను చేరదీసి వారిని పెంచి పెద్ద చేసి జీవితంలో స్థిరపడే వరకు మార్గం చూపిస్తూ అనాథ బాలల ఆత్మబంధువుగా మారింది ఐఎస్‌సదన్ డివిజన్ పరిధిలోని కృష్ణానగర్‌లోని కారుణ్యసింధు అనాథ ఆశ్రమం. విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో 1999లో ఈ ఆశ్రమం ప్రారంభించబడింది. అప్పట్లో ముగ్గురు అనాథ బాలుర చేరికతో ప్రారంభమైన ఈ ఆశ్రమంలో ప్రస్తుతం 55 మంది బాలురకు ఆశ్రయం కలిగిస్తోంది. అయిదు సంవత్సరాలు మొదలుకొని బాలురు ఆశ్రమంలో ఉంటూ ఎల్‌కేజీ నుంచి పదవ తరగతి వరకు సరస్వతీ శిశుమందిర్‌లో, జూనియర్ కాలేజీ, పాలిటెక్నిక్, ఇంజనీరింగ్ కళాశాలల్లో విద్యనభ్యసిస్తున్నారు. పలువురు సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లుగా, ఓ విద్యార్థి డాక్టర్‌గా స్థిరపడ్డారు. ఆశ్రమంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఉపాధ్యాయుల పరిశీలనలో పునశ్చరణ తరగతులు జరుగుతాయి. 25 సంవత్సరాల కాలంలో 250 మంది అనాథ బాలలు ఆశ్రయం పొందారు. ఆశ్రమం సొంత భవనంలో విశాల గదులు, ఆర్వో ప్లాంట్ ద్వారా శుద్ధమైన నీరు. విద్యుత్‌ను సోలార్ ప్లాంట్ల ద్వారా ఆధునీకరించారు. వేసవి సెలవులలో విద్యార్థులకు మన వారసత్వ సంపద వ్యక్తిత్వ వికాస శిక్షణ తరగతుల నిర్వహణ ద్వారా విద్యార్థులను సంస్కారవంతులుగా తీర్చిదిద్దే ప్రయత్నం చేస్తున్నారు. విద్యార్థుల దినచర్య ఉదయం 5 గంటలకు మొదలై రాత్రి 9.30 గంటలకు నిద్రకు ఉపక్రమిస్తారు. అంతేగాకుండా పేద మహిళలకు కుట్టు, క్రాఫ్ట్, మగ్గం, బ్యూటీషియన్, కంప్యూటర్ ఉచిత శిక్షణ ఇచ్చి ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నారు.

వినయ్‌నగర్ కమ్యూనిటీ హాల్‌లో నేడు వేడుకలు

చంపాపేట కృష్ణానగర్‌లోని కారుణ్యసింధు అనాథ ఆశ్రమం 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆదివారం సిల్వర్ జూబ్లీ వేడుకలు వినయ్‌నగర్ కమ్యూనిటీ హాల్‌లో ఉదయం 10.30గంటలకు ప్రారంభమవుతాయని కారుణ్య సేవా సమితి అధ్యక్షుడు ఆచార్య కడారి సత్యమూర్తి తెలిపారు. ముఖ్య అతిథులుగా వీహెచ్‌పీ అఖిలభారత ప్రముఖ్ అజయ్‌కుమార్ పారీక్, హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మాధవిదేవి, సర్వేశ్వరానందశివయోగిస్వామి, వీహెచ్‌పీ తెలంగాణ అధ్యక్షుడు నర్సింహమూర్తి తదితరులు హాజరవుతారని చెప్పారు.

శివారు ప్రాంతాల అభివృద్ధికి కృషి చేస్తా

- మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్


అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

హయత్‌నగర్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): నగర శివారు ప్రాంతాల్లోని కాలనీల అభివృద్ధికి కృషి చేస్తానని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. శనివారం ఆయన ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డితో కలిసి హయత్‌నగర్ డివిజన్‌లోని సూర్యానగర్‌కాలనీ, ఇన్నర్‌మేషన్ కాలనీ, సత్యనారాయణకాలనీ, వెంకటేశ్వరకాలనీ, మహాగాయత్రికాలనీ నుంచి కుమ్మరికుంట వరకు సుమారు రూ.3కోట్లతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శివారులో రోజు రోజుకు కొత్త కాలనీలు వెలుస్తున్నాయని వాటికి మౌలిక సదుపాయాలు కల్పించడానికి కృషి చేస్తానని అన్నారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ నవజీవన్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కళ్లెం రవీందర్‌రెడ్డి, నాయకులు దీపావళి శ్రావన్‌కుమార్, చెన్నగోని శ్రీధర్ గౌడ్, ఉగాది ఎల్లప్ప, గుడాల మల్లేష్ పాల్గొన్నారు.

పార్టీలకు అతీతంగా అభివృద్ధి పనులు

వనస్థలిపురం: పార్టీలకు అతీతంగా అభివృద్ధి పనులు చేపడతామని ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డిలు అన్నారు. శనివారం బీఎన్‌రెడ్డినగర్, హయత్‌నగర్ డివిజన్లలో సుష్మాసాయినగర్, శ్రీరామనగర్, సిరిపురంకాలనీ పలు కాలనీల్లో సుమారు ఆరు కోట్ల నిధులతో పలు అభివృద్ధి పనులకు ఎంపీ, ఎమ్మెల్యే, కార్పొరేటర్లు మొద్దు లచ్చిరెడ్డి, కళ్లెం నవజీవన్‌రెడ్డిలు శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాలనీలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి పార్టీలకు అతీతంగా కృషి చేస్తామన్నారు.

నీకేం తెలుసు.. నీకేం తెలుసు.. అంటూ లచ్చిరెడ్డి, అరవింద్‌రెడ్డిల మధ్య వాగ్వాదం

బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ హరిహరపురంకాలనీలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన అనంతరం కార్పొరేటర్ లచ్చిరెడ్డి డివిజన్‌లోని సిరిపురంకాలనీలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయడానికి వెళ్దామని ఎమ్మెల్యే, ఎంపీలకు సూచిస్తున్న తరుణంలో బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు కటికరెడ్డి అరవింద్‌రెడ్డి సచివాలయనగర్‌లో అభివృద్ధి పనులకు శంకస్థాపన చేయడానికి వెళ్దామని ఎమ్మెల్యే, ఎంపీలకు సూచిస్తుండగా కార్పొరేటర్ నీకేం తెలుసు అనడంతో ఆవెంటనే అరవింద్‌రెడ్డి నీకేం తెలుసు అనడంతో ఇరువురి మధ్య వాగ్వాదం జరుగుతుండగా అక్కడ ఉన్న ఎమ్మెల్యే, ఎంపీలు కల్పించుకుని వారిని సముదాయించడంతో గొడవ సద్దుమనిగింది. దీంతో అక్కడ నుంచి సిరిపురంకాలనీలోని అభివృద్ధి పనులకు వెళ్లారు. శ్రీధర్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, గుత్తా లక్ష్మారెడ్డి, హన్మంత్‌రెడ్డి, నాగమణిరెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.


హైదరాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్‌గా నియమితులైన చెకొలేకర్ లక్ష్మీ రాష్ట్ర వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావును కలిసి పుష్పగుచ్ఛం అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి చైర్‌పర్సన్‌కు మిఠాయి తినిపించి అభినందించారు. టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చెకలేకర్ శ్రీనివాస్, డైరెక్టర్లు ప్రత్యూష, కిషన్‌సింగ్ తదితరులు మంత్రిని కలిసిన వారిలో ఉన్నారు.
- చాదర్‌ఘాట్, ఆంధ్రజ్యోతి

నేడు రంగాచార్య 20వ స్మారక పురస్కారాల ప్రదానం

హైదరాబాద్‌సిటీ, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): మరింగంటి శ్రీరంగాచార్య 20వ స్మారక పురస్కారాల ప్రదాన కార్యక్రమం ఆదివారం సాయంత్రం 5.30 గంటలకు కొత్తపేట్‌లోని అష్టలక్ష్మి ఆలయంలో జరగనుందని నిర్వాహకులు విజయసారథి తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా త్రిదండి దేవనాథ రామానుజ జీయరుస్వామి, డాక్టర్ ఎస్‌వీ.రంగరామానుజాచార్యులు పాల్గొంటారని, ఉత్తమ సంస్కృత పండిత పురస్కారాన్ని సముద్రాల శఠగోపాచార్యులు అందుకుంటారని పేర్కొన్నారు. పురస్కార ప్రదానంతో పాటు గ్రంథాలు, ఆడియోల ఆవిష్కరణ కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు.

సమగ్ర సర్వేలో ప్రజాప్రతినిధులు వివరాలు ఇవ్వాలి


మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

ఎల్బీనగర్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ప్రజాప్రతినిధులు తమ వివరాలన్నింటిని నమోదు చేయించుకోవాలని సీపీఎం సరూర్‌నగర్ సర్కిల్ కార్యవర్గసభ్యులు కట్ట శ్రీనివాస్, ఎం.గోపినాయక్‌లు డిమాండ్ చేశారు. శనివారం ఆర్‌కేపురంలోని ఎన్‌టీఆర్‌నగర్‌లో ఇంటింటి సర్వేను పరిశీలించిన వారు మాట్లాడుతూ ముందుగా ప్రజాప్రతినిధులు తమ ఆస్తులు, ఇతర వివరాలన్నింటిని మీడియా సాక్షిగా సర్వేలో నమోదు చేయించుకున్న తర్వాతే తెలంగాణలో ఇంటింటి సర్వే చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఆరు హామీలు ఇచ్చిందని ఈ హామీలను సక్రమంగా అమలు చేయలేక ప్రజల దృష్టి మరల్చేందుకే సమగ్రసర్వే, హైడ్రా, ఫార్మా కంపెనీలకు భూసేకరణ అంటూ రోజుకో కార్యక్రమం చేపడుతున్నారని వారు విమర్శించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు వెంకన్న, వినోద్, ముస్తఫా, చంద్రకళ పాల్గొన్నారు.

కబ్జాదారుడి నుంచి కాపాడండి

- మా ప్లాట్ల విషయంలో ఏ మంత్రి జోక్యం చేసుకోలేదు
- సోమలింగేశ్వరనగర్ ప్లాట్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు

పంజాగుట్ట, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): తమ ప్లాట్లను కబ్జా చేయాలని ప్రయత్నిస్తున్న వ్యక్తి బారి నుంచి తమను కాపాడి న్యాయం చేయాలని హయత్‌నగర్‌లోని సోమలింగేశ్వరనగర్ ప్లాట్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. తమ ప్లాట్ల విషయంలో నల్గొండ జిల్లాకు చెందిన ఏ మంత్రి జోక్యం చేసుకోలేదని అసోసియేషన్ అధ్యక్షుడు టి.చెంచల్‌రావు, ప్రధాన కార్యదర్శి ఎంపీ రావు పేర్కొన్నారు. శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. సర్వే నెంబర్లు 180, 187లలో ఉన్న సుమారు 9.20 ఎకరాల స్థలంలో పట్టాదార్లు వేసిన వెంచర్‌లో 101 ప్లాట్లను రిజిస్టర్డ్‌సేల్ డీడ్ ద్వారా 1983-1986 మధ్య కొనుగోలు చేసినట్లు తెలిపారు. 2004లో వేమిరెడ్డి సురేందర్‌రెడ్డి తమకు ప్లాట్లు అమ్మిన వారితో కుమ్మక్కై, దీనిని వ్యవసాయ భూమిగా చూపించి రెండోసారి కొనుగోలు చేశాడన్నారు. తమ ప్లాట్లను కబ్జా చేయాలని చూస్తున్న సురేందర్‌రెడ్డి నుంచి తమకు రక్షణ కల్పించాలని, తమ ప్లాట్లను తమకు దక్కేలా చూడాలని వారు విజ్ఞప్తి చేశారు.

పెండింగ్ ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను విడుదల చేయాలి


మాట్లాడుతున్న ప్రగతిశీల మహిళా సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు అనసూయ

హయత్‌నగర్ : రాష్ట్రంలో ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థుల సమస్యలపై దృష్టి సారించకపోవడం సరైన పద్ధతి కాదని ప్రగతిశీల మహిళా సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు అనసూయ అన్నారు. శనివారం హయత్‌నగర్‌లోని జూనియర్ కళాశాలలో ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం(పీడీఎస్‌యూ) ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు చెల్లించాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను మంజూరు చేయడంలో ప్రభుత్వం తీవ్ర జాప్యం చేస్తుందన్నారు. దీంతో పేద విద్యార్థులు చదువులకు దూరం అయ్యే అవకాశం ఉందన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల ప్రైవేటు కళాశాలలు బలవంతంగా విద్యార్థుల చేత ఫీజు కట్టించుకునేందుకు వేధిస్తున్నారని అన్నారు. ఇప్పటికే ఇంటర్ మీడియట్ విద్యా విధానం పూర్తిగా కార్పొరేట్ చేతుల్లోకి వెళ్లిందని విచారం వ్యక్తం చేశారు. పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు పి. మహేష్ మాట్లాడుతూ గురుకులాల్లో నెలకొన్న సమస్యలను పట్టించుకునే వారే లేరని అన్నారు. పీడీఎస్‌యూ గ్రేటర్ కార్యదర్శి శ్రీనివాస్, జ్వాలా వెంకటేశ్వరావు, రహీం, జీవన్ పాల్గొన్నారు.

పుట్టగొడుగుల్లా అక్రమ వ్యాపార సముదాయాలు

- చర్యలు తీసుకోని టౌన్‌ప్లానింగ్ అధికారులు
- అసిస్టెంట్ జోనల్ కమిషనర్‌కు సీపీఐ నాయకుల ఫిర్యాదు


అక్రమ షెడ్లపై చర్యలు తీసుకోవాలని అసిస్టెంట్ జోనల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేస్తున్న సీపీఐ నాయకులు

హయత్‌నగర్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): హయత్‌నగర్, మన్సూరాబాద్, బీఎన్‌రెడ్డి, నాగోల్, వనస్థలిపురం డివిజన్‌లలో అనుమతి లేకుండా అక్రమ వ్యాపార సముదాయాలు నిర్మిస్తున్నా టౌన్‌ప్లానింగ్ అధికారులు పట్టించుకోవడం లేదని సీపీఐ నాయకులు శనివారం ఎల్బీనగర్ సర్కిల్ అసిస్టెంట్ జోనల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. ఎల్బీనగర్ నియోజకవర్గం సీపీఐ సమితి ఆధ్వర్యంలో పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఆందోజు రవీంద్రాచారి, హయత్‌నగర్ మండల కార్యదర్శి శేఖర్‌రెడ్డిలు మాట్లాడుతూ అక్రమ షెడ్ల నిర్మాణం పేరుతో కొంత మంది కింది స్థాయి అధికారులు, చోటామోటా నాయకులు దొడ్డిదారిన సంపాదిస్తున్నారని అన్నారు. సామాన్య ప్రజలు 100 గజాల్లో ఇంటి నిర్మాణం చేస్తే అనుమతుల పేరుతో కూల్చి వేస్తున్న అధికారులు అక్రమ వ్యాపార సముదాయాలను ఎందుకు కూల్చడం లేదని ప్రశ్నించారు. కొందరు అధికారులు జీహెచ్‌ఎంసీ ఆదాయానికి గండి కొట్టేలా అక్రమ షెడ్లను ప్రోత్సహిస్తు అవినీతికి పాల్పడుతున్నారని అన్నారు. హయత్‌నగర్, మన్సూరాబాద్ డివిజన్‌లో వేల కొలది అక్రమ షెడ్లు ఉన్నాయని తెలిపారు. ఇప్పటికైనా అధికారులు అక్రమ షెడ్లకు కూడా తాత్కాలిక అనుమతులు ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు. దీని వల్ల జీహెచ్‌ఎంసీకి ఆదాయం కూడా పెరుగుతుందన్నారు. అనుమతి లేని షెడ్లపై చర్య తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు పాల్గొన్నారు.

హయత్‌నగర్ కోర్టులో మౌలిక సదుపాయాలు కల్పిస్తాం

- జిల్లా న్యాయమూర్తి శశిధర్‌రెడ్డి


హయత్‌నగర్ కోర్టులో బార్ అసోసియేషన్ భవనానికి శంకుస్థాపన చేస్తున్న జిల్లా న్యాయమూర్తి శశిధర్‌రెడ్డి

హయత్‌నగర్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): హయత్‌నగర్ కోర్టులో మౌలిక సదుపాయాల కోసం తన వంతు కృషి చేస్తానని రంగారెడ్డి జిల్లా న్యాయమూర్తి శశిధర్‌రెడ్డి అన్నారు. హయత్‌నగర్ కోర్టు ప్రాంగణంలో నూతనంగా నిర్మించనున్న బార్ అసోసియేషన్ భవనం శంకుస్థాపన కార్యక్రమానికి శనివారం జిల్లా జడ్జి ముఖ్య అతిథిగా హాజరై శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హయత్‌నగర్ కోర్టులో అవసరం ఉన్న మౌలిక సదుపాయాలను కల్పించడానికి కృషి చేస్తానని అన్నారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు భిక్షపతిగౌడ్ జిల్లా జడ్జిని ఘనంగా సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ హయత్‌నగర్ కోర్టుకు శాశ్విత భవనాన్ని నిర్మించాలని కోరారు. పర్మినెంట్ భవనం లేక కలుగుతున్న ఇబ్బందులను జిల్లా జడ్జికి వివరించారు. భవనానికి సంబంధించిన డీపీఆర్ కూడా సిద్ధం చేసినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో 7వ మెట్రోపాలిటన్ కోర్టు సూపరింటెండెంట్ శారద, నాజర్ లక్ష్మీనర్సింహారెడ్డి, అడ్వకేట్ సొసైటీ కార్యదర్శి శ్రీధర్, గిరి, అనీల్‌కుమార్, బార్ కౌన్సిల్ సభ్యుడు మధుసూదన్‌రావు, బార్ అసోసియేషన్ కార్యదర్శి కృష్ణ, వనస్థలిపురం ఏసీపీ కాశిరెడ్డి, సీఐలు నాగరాజుగౌడ్, అంజిరెడ్డి, శ్రీనివాస్, న్యాయవాదులు సంతోష్‌గౌడ్, లింగంగౌడ్, రామ్మోహన్, న్యాయవాదులు పాల్గొన్నారు.

దివంగత పూర్వ విద్యార్థుల సంస్మరణ సభ

మన్సూరాబాద్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): నాగోల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వవిద్యార్థుల సంఘం కోశాధికారి దివంగత అనంతుల వేణుగోపాల్ గౌడ్, దివంగత కొత్త జగన్ నేతల సంస్మరణ సభను శనివారం నాగోల్‌చౌరస్తా వద్ద ఏర్పాటు చేశారు. నాగోల్ జడ్పీహెచ్ఎస్ పూర్వవిద్యార్థుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో అనంతుల వేణుగోపాల్‌గౌడ్, కొత్త జగన్ నేతల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారి జ్ఞాపకార్థం అన్నదానం చేశారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు కందికంటి కన్నాగౌడ్, మేకల సత్యనారాయణ, మెండు వెంకట్‌రెడ్డి, బొడ్డుపల్లి సురేష్, ప్రదీప్‌కుమార్, సిద్ది రమేష్, నాళ్ల ఉమామహేశ్వర్ గుప్తా, లింగంగౌడ్, బాలరాజు పాల్గొన్నారు.

ఉద్యోగం ఇప్పిస్తామంటూ డబ్బు కాజేసిన సైబర్ మోసగాళ్లు

- పోలీసులను ఆశ్రయించిన బాధితుడు

కొత్తపేట, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): ఉద్యోగం ఇప్పిస్తామంటూ సైబర్ మోసగాళ్లు ఓ వ్యక్తి వద్ద ఆన్‌లైన్‌లో రూ.32,314లు కాజేసిన ఘటన ఎల్బీనగర్ పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌హెచ్‌ఓ వినోద్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మన్సూరాబాద్‌లో ఉండే ఉప్పునూతల ఆంజనేయులు(32) ప్రైవేటు ఉద్యోగి. ఈనెల 22వ తేదీన టెలిగ్రామ్ యాప్‌లో ఓ లింక్ వచ్చింది. లింకు క్లిక్ చేస్తే పార్ట్‌టైం జాబ్ ఆఫర్ కనిపించడంతో మరింత సమాచారం కోసం ప్రయత్నించాడు. ఉద్యోగం ఉందని అయితే కొంత డబ్బు పెట్టుబడి పెట్టాలని, ఎక్కువ లాభం వస్తుందని గుర్తు తెలియని వ్యక్తులు ఆయనకు ఫోన్‌లో తెలిపారు. వెంటనే వారిచ్చిన అకౌంటు నెంబరుకు అతడు ఐడీబీఐ ఖాతా నుంచి రూ.10వేలు బదిలీ చేశాడు. అనంతరం పెద్ద మొత్తంలో డబ్బు పెట్టుబడి పెట్టాలని, మరింత లాభం పొందవచ్చని వారు నమ్మబలికారు. అతడి ఫెడరల్ బ్యాంకు ఖాతా నుంచి రూ.22,314లను బదిలీ చేశాడు. అతడు మోసపోయినట్లు గుర్తించాడు.

లాభాలు వస్తాయని నమ్మితే గుర్తు తెలియని వ్యక్తుల నుంచి ఎటువంటి సమాధానం రాలేదు. దీంతో అతడు సైబర్ సెల్ నెం. 1930కి కాల్ చేశాడు. అతడి ఫిర్యాదు మేరకు ఎల్బీనగర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

ఆస్పత్రిలో వ్యక్తి మృతి


- వైద్యం వికటించడంతోనే మృతిచెందాడని బంధువుల ఆందోళన

మన్సూరాబాద్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదానికి గురైన ఓ యువకుడు ఎల్బీనగర్‌లోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతిచెందాడు. కాగా వైద్యుల నిర్లక్ష్యంతో వైద్యం వికటించి మృతిచెందాడంటూ బంధువులు ఆస్పత్రి ముందు ఆందోళనకు దిగారు. వివరాల్లోకి వెళితే.. అబ్దుల్లాపూర్‌మెట్ చిన్నబండరావిరాలకు చెందిన హరికృష్ణారెడ్డి(27) రోడ్డు ప్రమాదానికి గురవడంతో తలకు బలంగా గాయమైంది. దీంతో శుక్రవారం మధ్యాహ్నం సుమారు 12 గంటలకు సదరు ఆస్పత్రిలో చికిత్స నిమిత్తం ఎమర్జెన్సీ వార్డులో చేర్చగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. వైద్యుల నిర్లక్ష్యంతో వైద్యం వికటించడంతోనే హరికృష్ణ చనిపోయాడంటూ మృతుడి మేనమామ వెంకట్‌రెడ్డి, బంధువులు ఆందోళనకు దిగారు. విషయం తెలుసుకున్న ఎల్బీనగర్ పోలీసులు ఆస్పత్రి వద్దకు చేరుకోగా ఆందోళన సద్దుమణిగింది.

మా తప్పేం లేదు..: డాక్టర్

తలకు బలమైన గాయమై చాలా క్లిష్టమైన పరిస్థితుల్లో రోగి హరికృష్ణారెడ్డిని ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తీసుకువచ్చారని సదరు ఆస్పత్రి రెసిడెంట్ మెడికల్ ఆఫీసర్ తెలిపారు. రోగి వచ్చినప్పటి నుంచి ఎమర్జెన్సీలో తమ వైద్య బృందం ఎప్పటికప్పుడు సరైన వైద్యం అందించినా అతడి అవయవాలు సహకరించక కార్డియాక్ అరెస్టయ్యి మృతిచెందాడని, ఇందులో తమ తప్పేమీ లేదని తెలిపారు. రోగి పరిస్థితిని ఎప్పటికప్పుడు బంధువులకు చెబుతూ వచ్చినా వారు ఆందోళన చేయడంలో ఎలాంటి అర్థం లేదన్నారు. తమదే తప్పంటూ ఆరోపణలు చేస్తూ వారు రూ.20లక్షలు ఇస్తే మీపై ఎలాంటి కేసు పెట్టమని డిమాండ్ చేశారని, ఇందుకు నిరాకరించడంతో ఆస్పత్రిపై లేనిపోని ఆరోపణ చేస్తున్నారని డాక్టర్ తెలిపారు. ఈ మేరకు శనివారం ఎల్బీనగర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు సైతం చేసినట్లు ఆయన తెలిపారు.

భార్య అదృశ్యం.. భర్త ఫిర్యాదు


సౌమ్యశ్రీ

హయత్‌నగర్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): భర్తకు చెప్పకుండా భార్య ఇంట్లో నుంచి బయటకు వెళ్లిన సంఘటన హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హయత్‌నగర్ టెలిఫోన్ కాలనీకి చెందిన సౌమ్యశ్రీ(24)కు గత సంవత్సరం మేడారం శ్రీనివాస్ అనే వ్యక్తితో వివాహం జరిగింది. ఆరు నెలలుగా శ్రీనివాస్, సౌమ్యశ్రీ మధ్య గొడవలు జరుగుతున్నాయి. దీంతో పెద్ద మనుషులు జోక్యం చేసుకుని ఇద్దరి మధ్య సయోధ్య కుదిర్చారు. అప్పటి నుంచి ఇద్దరు కలిసి ఉంటున్నారు. ఇదిలా ఉండగా శుక్రవారం సాయంత్రం ఇంట్లో ఎవరికి చెప్పకుండా సౌమ్యశ్రీ బయటకు వెళ్లింది. తిరిగి రాకపోవడంతో భర్త శనివారం సాయంత్రం తన భార్య కనిపించడం లేదని హయత్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వివాహిత అదృశ్యం


సౌమ్య

హయత్‌నగర్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): వివాహిత అదృశ్యమైన సంఘటన హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మునగనూరు గ్రామానికి చెందిన మరికంటి సౌమ్య(19)కి 4 నెలల క్రితం మన్సూరాబాద్‌కు చెందిన వినయ్‌తో వివాహం జరిగింది. ఐదు రోజుల క్రితం ఆరోగ్యం బాగోలేదని మన్సూరాబాద్ నుంచి మునగనూరు గ్రామానికి వచ్చింది. దీంతో తల్లి నిర్మల ఆస్పత్రిలో చూపించి మందులు ఇప్పించింది. శనివారం సౌమ్య తన అత్తారింటికి వెళ్తున్నానని చెప్పివెళ్లింది. కానీ సౌమ్య అక్కడికి చేరుకోలేదు. ఎంతగా వెతికినా ఆచూకీ లేకపోవడంతో శనివారం రాత్రి సౌమ్య తల్లి నిర్మల హయత్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీనితో పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.